క్లుప్తంగా

పరామర్శ



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు బాసాని కైలాసం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆదివారం వరంగల్ మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్ సందర్శించి కైలాసం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కందగట్ల రవి, నాయకులు బాసాని లక్ష్మీనారాయణ, సదాశివుడు, సామల రవీందర్, దిడ్డి ప్రభాకర్, బాసాని చంద్రమొగిలి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం రామ్‌నగర్–గట్లనర్సింగాపూర్ మధ్యలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా చిల్పూరు గ్రామానికి చెందిన కందుల మధు ద్విచక్రవాహనంపై హుస్నాబాద్ వైపు వెళ్తున్న క్రమంలో కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలోఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఎస్సైని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



శాయంపేట : ఎస్సైగా జక్కుల పరమేష్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి హింగె భాస్కర్, మాజీ సర్పంచ్ ముక్కెర అనూషప్రేమ్‌సాగర్, దేవనాడి మల్లాజీ, కాంగ్రెస్ జిల్లా నాయకులు గోపాల్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, వంశీధర్ రెడ్డిలు మార్యదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



పరకాల : పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో భవన నిర్మాణ కార్మికులకు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 500 మంది లేబర్ కార్డు కలిగిన 500 మంది కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు భవన నిర్మాణ కార్మికులకు మెరుగైన వైద్యం అందించడానికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు 1వ వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్ అన్నారు.

సన్మానం



గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌కు చెందిన నమిండ్ల సుష్మ స్వరాజ్ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో ప్రవేశం సాధించిన క్రమంలో ఆమెను గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు శాలువాతో ఆదివారం ఘనంగా సన్మానించారు. అలాగే ఎంబీబీఎస్ విద్యాభ్యాసం కోసం రూ.15 వేల సాయం అందజేశారు. ఇటీవల జరిగిన ప్రవేశ పరీక్షలో సుష్మ మెరుగైన ర్యాంకు సాధించి సీటు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్క కుమారస్వామి, అప్పని సదానందం, పత్తిపాక శేఖర్, తిప్పని సురేశ్, ముక్కెర పెద్దిరాజు, బిల్ల ప్రవీన్, మంద రమేశ్, నమిండ్ల పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ విద్యార్థి సేన కేయూ కమిటీ ఎన్నిక



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో సేవాలాల్ విద్యార్థి సేన యూనివర్సిటీ ఇన్‌చార్జ్ తిరుపతినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేతావత్ కుమార్, ఉపాధ్యక్షులుగా ధరావత్ రవి, బాలాజీ, జాటోతు అలీన్, ప్రధాన కార్యదర్శిగా పవర్ అంజుకుమార్, సహాయ కార్యదర్శులుగా విజయ్, సురేష్, సందీప్ ఎన్నికయ్యారు. సమావేశంలో సేవాలాల్ విద్యార్థి సేన హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సిద్దునాయక్ పాల్గొన్నారు.

వేధిస్తున్న కూలీల కొరత



కూలీల కొరతతో చెట్లపైనే పత్తి



ఎల్కతుర్తిలో మంచుకు నల్లబడుతున్న పత్తి

- పగిలి ఏరేందుకు సిద్ధంగా ఉన్న పత్తికాయలు
- చేలలోనే నల్లబడుతున్న తెల్లబంగారం

ఎల్కతుర్తి : మండలంలో యాసంగి వరినాట్లు జోరు అందుకోవడంతో పత్తి రైతులను కూలీల కొరత వేధిస్తుంది. క్రిస్మస్ పండగ ముందే పత్తి చేళ్లలోని పత్తికాయలు పగిలి పత్తి ఏరేందుకు సిద్ధంగా తయారయ్యాయి. మండలం వ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు 5 వేల ఎకరాల్లో రైతులు పత్తిపంట సాగుచేశారు. ఆరంభంలోనే జోరుగా కురిసిన వర్షాలకు అక్కడక్కడా పంటకు కొంత మేర నష్టం వాటిల్లినప్పటికీ వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులను పిచికారి చేయడంతో ఆ పంట కాస్తా తిరిగి చిగురించింది. పండించిన పత్తిపంటను గ్రామాల్లోని రైతులు ఇప్పటికే గత రెండు, మూడు సార్లు ఏరించారు. కాగా చివరి దశలో కాసిన కాతంతా పగిలి పండుగ ముందే ఏరేందుకు సిద్ధంగా మారింది. ఈ క్రమంలో యాసంగి వరినాట్లు జోరందుకోవడంతో కూలీలు వరినాట్లవైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. దీంతో పత్తి ఏరేందుకు కూలీల కొరత ఏర్పడడంతో ఉదయాన్నే వేస్తున్న చలికి కురుస్తున్న మంచుకు చేతికందొచ్చిన తెల్లబంగారం కాస్త నల్లబడిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ రంగాన్ని ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేసి కూలీల కొరత నుంచి విముక్తి కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రెండున్నర ఎకరాలు వేశాను

ఖరీఫ్‌లో రెండున్నర ఎకరాలు పత్తిపంట సాగుచేశాను. ప్రస్తుతం సాగు చేసిన పత్తి చివరి దశకు చేరింది. క్రిస్మస్ ముందే పత్తికాయంతా పగిలి ఏరేందుకు సిద్ధంగా ఉంది. యాసంగి వరినాట్ల వల్ల కూలీలు దొరకడం లేదు. ముందే ఏరాల్సిన పత్తి కూలీలు దొరకక నిలిచిపోయింది. చెట్లమీద ఉన్న పత్తి అంతా చలిమంచుకు నల్లబడి పోతాంది.

– లచ్చమ్మ మహిళా రైతు

గిట్టుబాటు ధర లభించడం లేదు

వ్యవసాయ రంగానికి కూలీల కొరత ఎటేటా తీవ్రతరమవుతోంది. అదనపు పెట్టుబడి పెడితే పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో రైతులంతా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఉపాధిహామీ పథకానికి వ్యవసాయాన్ని అనుసంధానం చేస్తే రైతుకు కాస్త ఆర్థిక భారం తగ్గుతుంది. వ్యవసాయం లాభసాటిగా మారే అవకాశం ఉంది.

– కర్రె భిక్షపతి, సీపీఐ జిల్లా కార్యదర్శి

రక్తదానం ప్రాణదానంతో సమానం

- డీసీసీబీ డైరెక్టర్ గుండ్రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి



రక్తదానం చేస్తున్న యువకులు

ధర్మసాగర్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారికి అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావాల్సిన వారిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని డీసీసీబీ డైరెక్టర్, ధర్మసాగర్ పీఏసీఎస్ చైర్మన్ గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జనవరి 1న ఆయన పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలోని సుష్మిత గార్డెన్లో ఆదివారం రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కంటే రక్తదానం గొప్పదని తెలిపారు. మీరు చేసే రక్తదానం ఒకరి ప్రాణాలను కాపాడుతుందని అలాంటి సందర్భాల్లో రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తున్నారని అన్నారు. మెగా శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన సుమారు 100 మంది దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు, విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

10న సంక్రాంతి ముగ్గుల పోటీలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

కమలాపూర్ : పుల్ల ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో జనవరి 10న స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా యూనివర్సిటీ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్ల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముగ్గుల పోటీలకు సంబంధించిన కరపత్రాలు ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సంక్రాంతి ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.10,116 విలువ గల పట్టుచీర, ద్వితీయ బహుమతిగా రూ.5,116 విలువ గల పట్టుచీర, తృతీయ బహుమతిగా రూ.3,116 విలువ గల పట్టుచీర, కన్సోలేషన్ బహుమతుల కింద పదిమందికి రూ.516 విలువ గల ఫ్యాన్సీ చీరలను హనుమకొండలోని పీఎస్.మూర్తి క్లాత్ స్టోర్స్ సహకారంతో అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళలు, యువతులు ఈ నెల 30 నుంచి జనవరి 6 వరకు పుల్ల బుజ్జమ్మ 9676840767, ఉమ 6281792917, విజయలక్ష్మి 9989707656, హైమ 9381675290 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే వారు ముగ్గుల సామాగ్రి, రంగులు తమ వెంట తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పుల్ల కొంరయ్య, సంజీవ్, సుధాకర్, శ్రీనివాస్, ఐలయ్య, శోభన్, రాజు, పున్నం, కుమార్, నవీన్, శాంతికుమార్, రాజేష్, రాధ, సాంబన్న, వెంకన్న, భిక్షపతి, రమేష్, వర్షిత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సహకారం అందించేందుకు సొసైటీ ఏర్పాటు

- రిటైర్డ్ డీఎస్పీ భూమయ్య



మాట్లాడుతున్న రిటైర్డ్ డీఎస్పీ భూమయ్య

ఎల్కతుర్తి: సైనికుల కుటుంబాలు ఒ కరికొకరు సహకారం అందించుకోవడానికి సొసైటీ ఏర్పరుచుకోవడం ఆదర్శప్రాయమని రిటైర్డ్ డీఎస్పీ భూమయ్య అన్నారు. ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని సైనిక్ వెల్ఫేర్ సొసైటీ 6వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షుడు గండు శ్రీనివాస్ అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథిగా భూమయ్య హాజరై మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఒక్క రూ స్వేచ్ఛగా ప్రశాంతంగా ఉండేందుకు కారణం సైనికులే అని అన్నారు. అనంతరం సొసైటీ వెల్ఫేర్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొసైటీ భవన నిర్మాణానికి స్థలం ఏర్పాటుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సైన్యంలో వీరమరణం పొందిన సైనికుల కుటుంబాలకు సొసైటీ ఉండగా ఉండడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, 150 సైనిక కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయపడి చికిత్స పొందుతుండగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్ రెడ్డి ఆదివారం రూ.10 వేల సహాయం అందించారు. అలాగే కొమ్మాలకు చెందిన బొనగాని మల్లమ్మ, బట్టమేకల దూడమ్మ, గజ్జిమేకల కేతమ్మలు, ఎలుకుర్తి హవేలికి చెందిన ఐలోని భద్రయ్య, గొర్రె యాదగిరి, అక్కెల్లి స్వామి ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబాలకు బాలకిశోర్‌రెడ్డి రూ.5 వేల చొప్పున సాయం అందజేశారు. బాలకిశోర్‌రెడ్డి పంపిన డబ్బును బాధిత కుటుంబాలకు నాయకులు అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్ అందజేశారు.

మన్మోహన్‌సింగ్‌కు కొవ్వొత్తులతో నివాళి



కమలాపూర్ : కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు



కమలాపూర్: గూడూరులో..

ఎల్కతుర్తి : ఆర్థిక సంస్కరణల రూపకర్త, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని అంబేడ్కర్ చౌక్ వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు కొ వ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్: మండలంలోని గూడూరు, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో ఆదివారం రాత్రి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించి మౌనం పాటించారు. కార్యక్రమాల్లో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు చరణ్‌పటేల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూడ శ్రీకాంత్, నాయకులు కుమ్మరి శ్రీకాంత్, పాక అనిల్, శ్రీనివాస్, ఆడెపు శ్రీకాంత్, ఎండీ.ఆసిఫ్, కుమ్మరి బాబు, వెంగళ శివ, పాక చంద్రమౌళి, రాజు, బాషబోయిన రమేష్, గాలిబ్ శంకర్, మనీష్‌గౌడ్, ధర్ముల శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాపడి పూజోత్సవం



పరకాల : మహాపడిపూజోత్సంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



దామెర : పడిపూజలో పూజలు నిర్వహిస్తున్న గురుస్వామి

పరకాల : పట్టణంలోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములతో మహాపడి పూజోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. పడిపూజోత్సవానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. ప్రజలందరిపై అయ్యప్పస్వామి కృప, చల్లని చూపు తప్పక ఉండాలని వేడుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం అయ్యప్పస్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వందలాది మంది అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

దామెర : మండలంలోని ఊరుగొండలో కుమారస్వామి నివాసంలో ఆదివారం మహా దివ్యపడి పూజ నిర్వహించారు. గ్రామంలో అయ్యప్పస్వామి శరణుఘోషతో మార్మోగింది. నర్సంపేట అయ్యప్ప స్వామి ఆలయ గురుస్వామి గందె రమేశ్ మంత్రోచ్ఛరణల మధ్య శ్రీధర్మ అయ్యప్పస్వామికి అష్టాభిషేకం నిర్వహించారు. అనంతరం పడి ముట్టిచ్చే కార్యక్రమంలో అయ్యప్పస్వాములు పాల్గొని భక్తిపారవశ్యంతో ఊగిపోయారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు కృష్ణారెడ్డి, మధు, కోశి, విజేందర్, రఘువీర్, ఆలేటి సునీల్ శ్రావణ్, అధిక సంఖ్యలో అయ్యస్వాములు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష డప్పులతో హైదరాబాద్ దద్దరిల్లాలి

- కళాకారుల సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బరిగెల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న బాబు

పరకాల: వచ్చే ఏడాది ఫిబ్రవరి 3న లక్ష డప్పులతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో భూమి ఆకాశం దద్దరిల్లేలా దండోరా వేయాలని కళాకారుల సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బరిగెల బాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ పిలుపునిచ్చారు. పరకాల అమరధామంలో ఆదివారం జరిగిన డప్పు కళాకారులు, కళామండలి, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా బాబు, శంకర్ మాదిగ హాజరై ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన డప్పు కళాకారుల హక్కుల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం మాదిగ డప్పు కళాకారుల జిల్లా కన్వీనర్‌గా కోకిల రవి, కో కన్వీనర్‌గా కొయ్యడ విష్ణులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఈర్ల చిన్ని, మాదిగ కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామంచ రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుముల కృష్ణ, మొగిళి, రమేష్, వేణు, దుప్పటి ప్రవీణ్, పసుల సదానందం, దుప్పటి రవి, బొచ్చు ప్రశాంత్, దుప్పటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయ ఏర్పాటుకు సహకరించాలి

డీఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి



మాట్లాడుతున్న కుమారస్వామి

వర్ధన్నపేట : మామునూరు విమానాశ్రయ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సహకరించి పూర్తి చేయాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్‌ఎస్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలో రాష్ట్ర కార్యదర్శి కంజర్ల సమ్మయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని పెద్దపల్లి, కొత్తగూడెం, మెదక్, ఖమ్మం జిల్లాల్లో విమానాశ్రయాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతోపాటు బడ్జెట్ కేటాయించాలని ఆకాంక్షించారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న తరుణంలో వరంగల్ జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. మామునూరు విమానాశ్రమం ఏర్పాటైతే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని చెప్పారు. అలాగే నియోజకవర్గ కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యకు కేంద్రం సహకరించాలని కోరారు. సమావేశంలో నాయకులు బాబు, వేణు, మధు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్స్ డే

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పెన్షనర్స్ డేను నిర్వహించనున్నట్లు సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ రాంనగర్‌లోని సంఘం కార్యాలయంలో సోమవారం ఉదయం అఖిల భారత 17వ పెన్షనర్స్ డేను నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్ రెడ్డి, సెక్రటరీ జనరల్ సిలివేరు చంద్రశేఖర్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. గుండె సంబంధిత వ్యాధులు, నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బీసీలకు న్యాయం చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

కేయూ క్యాంపస్: బీసీల కులగణన తర్వాత వెంటనే ఎలాంటి అభ్యంతరాలు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు ప్రకటించి బీసీలకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. దేశ జనాభాలో సగభాగం ఉన్న బీసీల పట్ల రాజకీయ పార్టీల వివక్ష కొనసాగుతోందన్నారు. బీసీల జనాభా 60శాతం వరకు ఉన్నప్పటికీ విద్య, ఉద్యోగ రంగాల్లో కేవలం 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలు అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం బీసీ విద్యార్థి సంఘం నూతన కమిటీని వేణుగోపాల్ ప్రకటించారు. బీసీ విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జ్‌గా ఆరెగంటి నాగరాజు, కేయూ అధ్యక్షుడిగా సుమన్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా భీమన్న, కోశాధికారిగా రవితేజ, ఉపాధ్యక్షులుగా రతన్, గణేష్, అజయ్‌సింగ్, సహాయ కార్యదర్శులుగా సాంబరాజు, రాఘవేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గణేష్, కార్యవర్గ సభ్యుడిగా హర్షవర్ధన్, గౌరవ అధ్యక్షుడిగా కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజును ఎన్నుకున్నారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మడిశెట్టి నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కురిమిళ్ల శ్రీనివాస్, రీసెర్చ్ స్కాలర్లు శృంగారపు విష్ణు, పాషా, అభిరామ్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

- టీపీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్థన్‌రెడ్డి



మాట్లాడుతున్న హర్షవర్ధన్ రెడ్డి

విద్యారణ్యపురి: సమగ్రశిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని టీపీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్థన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె ఆదివారం 23వ రోజుకు చేరుకుంది. హనుమకొండ, వరంగల్ జిల్లాల సమగ్ర శిక్ష ఉద్యోగులు హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద చేట్టిన దీక్షల శిబిరాన్ని హర్షవర్ధన్‌రెడి సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమగ్రశిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని సూచించారు. రెండు దశాబ్దాలుగా విద్యాశాఖలో చాలీచాలని వేతనాలతో కాంట్రాక్టు ఉద్యోగులుగా పని చేస్తున్నారని గుర్తుచేశారు. అలాగే, హనుమకొండ, వరంగల్ జిల్లాల అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ల అధ్యక్షులు జనార్దన్, సతీష్‌కుమార్, హెడుప్సా బాధ్యుడు బుచ్చి బాబురావు.. సమ్మెకు సంఘీభావం తెలిపారు. దీక్షలో సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు దొ నికల శ్రీధర్‌గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎండీ.షఫీ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే సంఘ్ ధ్యేయం

కాజీపేట రూరల్: రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారమే రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ధ్యేయమని రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ కొత్త మురళీకృష్ణ అన్నారు. కాజీపేటలోని సంఘ్ కార్యాలయంలో కాజీపేట సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. మురళీకృష్ణ మాట్లాడుతూ ఇటీవల జరిగిన రైల్వే గుర్తింపు సంఘాల ఎన్నికల్లో ఎన్‌ఎఫ్‌ఐఆర్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.రాఘవయ్య నేతృత్వంలో ఎన్‌ఎఫ్‌ఐఆర్‌ను రైల్వే కార్మికులు ఆదరించి దేశంలో ప్రథమ స్థానంలో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, లోకోరన్నింగ్ బ్రాంచ్ సెక్రటరీ మురళి, చైర్మన్ రవి, రిటైర్డ్ లోకో పైలట్ గోవిందరెడ్డిని నాయకులు సన్మానించారు. కాజీపేట రైల్వే సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ, లోకోరన్నింగ్ బ్రాంచ్ సెక్రటరీ చింత మురళి, చైర్మన్ కె.రవి, జోనల్ యూత్ కమిటీ సభ్యుడు, వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్, ట్రెజరర్ పి.సుధాకర్, అజీజ్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.